క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : పట్టణానికి చెందిన డీసీఎం డ్రైవర్ చాంద్‌పాషా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుడి కుటుంబానికి డీసీఎం యూనియన్ డ్రైవర్లు సేకరించిన రూ.50వేల ఆర్థికసాయాన్ని ఆదివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డబ్బికార్ మల్లేష్, డీసీఎం యూనియన్ అధ్యక్షుడు నాగటి జోసెఫ్‌మౌర్య, ఉపాధ్యక్షుడు కొరటికల్ రవి, కోశాధికారి దాస్యం అశోక్, మోర్త వెంకన్న, జమ్ములమడుగు సైదులు, చింతమల్ల అనిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొబ్బరికాయల వేలంపాట

పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండలంలోని కోదండాపురంలో గల శ్రీపద్మావతి–గోదాదేవి శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే జాతరకు గాను కొబ్బరికాయల విక్రయాలకు సోమవారం ఉదయం 10గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కోదండాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఈ వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో గంధోత్సవం



ఖవ్వాలీ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

డిండి : మండల కేంద్రంలోని సయ్యద్ హఖ్ఖానీ సాహెబ్ దర్గా గంధోత్సవాన్ని భక్తులు ఆదివారం తెల్లవారుజామున భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దర్గా ఆవరణలో ఖత్మేఖురాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఖవ్వాలీ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా దర్గా పీఠాధిపతి సయ్యద్ షాకీర్ పాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామి వారికి భక్తులు దట్టీలు, పూలమాలలు, మాలీదా సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కిషన్, ఉమాశంకర్, భీమయ్య, శివాజీ, అక్కోజీ, హబీబ్, రహీం, మోహనయ్య, షర్ఫొద్దీన్, లింగమయ్య, బాబా, జహంగీర్, రాములు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో మరుగు దొడ్లు శుభ్రంగా ఉండాలి



పెట్రోల్ బంకు తనిఖీ చేస్తున్న రఘునందన్

చింతపల్లి : పెట్రోల్ బంకుల్లో మరుగు దొడ్లు శుభ్రంగా ఉంచాలని, వినియోగదారుల ఆదరణ పొందేలా నిర్వహణ ఉండాలని వినియోగదారుల వ్యవహారాలు, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని సాగర్ రోడ్డులో గల పలు పెట్రోల్ బంకులను తనిఖీ చేసి మాట్లాడారు. కొన్ని పెట్రోల్ బంకుల్లో మరుగుదొడ్ల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని ఆక్షేపించారు. మరుగుదొడ్లు సరిగా చేయడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నోస్టాక్ బోర్డు పెట్టవద్దని సూచించారు.

గీతకార్మికుడికి నివాళి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో గీత కార్మికుడు రాచకొండ రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం రాములు మృతదేహాన్ని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తడకమళ్ల మాజీ సర్పంచ్ వెంకటయ్య, గీత కార్మిక సంఘం నాయకుడు సీతారాములు పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. యంత్రాలకు శాపం!

- మరమ్మతులకు నోచుకోక తుప్పు పట్టిన చెత్తసేకరణ వాహనాలు
- వాహనాల సామగ్రిని వేలం వేయాల్సి ఉన్నా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు



మిర్యాలగూడ పట్టణంలోని మున్సిపాలిటీలో తుప్పు పట్టిన ట్రాక్టర్



నిరుపయోగంగా మారిన చెత్త ట్రాక్టర్ ట్రాలీలు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీలో చెత్త సేకరించే ఆటోలు, ట్రాక్టర్ల నిర్వహణ సరిగ్గా లేక తుప్పుబట్టిపోతున్నాయి. మున్సిపాలిటీలో 48 వార్డులకు గాను 48 ఆటోలు ఉండగా వాటిలో ఐదారు ఆటోలు పూర్తిగా చెడిపోయి మరమ్మతులకు నోచుకోకుండా నిరుపయోగంగా ఉన్నాయి. చెత్తను తరలించే రెండు ట్రాక్టర్లు పూర్తిగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో షెడ్డుకే పరిమితమయ్యాయి. అదే విధంగా డంపర్ వెహికిల్ కూడా తుప్పుబట్టిపోతోంది. కొన్ని వాహనాల టైర్లు, విలువైన సామగ్రి ఇప్పటికే చోరీకి గురయ్యాయి. మున్సిపాలిటీలో గతంలో కాలువల్లో తీసిన చెత్తను తీసుకెళ్లేందుకు 100 వరకు విల్ భరోస్(చిన్న తోపుడు బండ్లు) ఉండేవి. అవి కూడా ఎందుకూ పనికిరాకుండా మారాయి. పాలక మండలి ఏర్పడిన తరువాత సుమారు రూ.లక్ష వ్యయంతో తోపుడు రిక్షాలు కొనుగోలు చేసినప్పటికీ అవి నెల రోజులు కూడా పని చేయకుండానే శిథిలావస్థకు చేరుకున్న విషయం తెలిసిందే. వాహనాల సామగ్రిని వేలం పాట వేస్తే కొంత వరకు ఆదాయాన్ని సమకుర్చుకునే అవకాశం ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్తా



మున్సిపాలిటీలో వాహనాల విషయంపై సమగ్రంగా వివరాలు తీసుకుని ఏమైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే చేయిస్తాం. పూర్తిగా డిస్‌మెంట్ అయిన వాహనాలను వేలం వేసేందుకు మున్సిపల్ ప్రత్యేకాధికారి అయిన అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా. – మహమ్మద్ యూసుఫ్,మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

సత్యసాయి ట్రస్ట్ సేవలు అభినందనీయం

పెద్దఅడిశర్లపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్ ద్వారా వైద్య సేవలు అందించడం అభినందనీయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని వద్దిపట్ల గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాను న్న రోజుల్లో మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రావు, సేవాదళ్ వాసుదేవరావు, లక్ష్మీనారాయణ, కృష్ణకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

డిండి: మండల పరిధిలోని దాసరినెమలిపూర్ గ్రామంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి 6 వరకు నిర్వహించే శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆదివారం దేవరకొండలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకటయ్యగౌడ్, సురేష్‌గౌడ్, మల్లారెడ్డి, రంగయ్య పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

రేణుక ఎల్లమ్మ అనుగ్రహం పొందాలి



వేడుకలో పాల్గొన్న రవీంద్రకుమార్, తదితరులు

కొండమల్లేపల్లి : ప్రతి ఒక్కరూ రేణుక ఎల్లమ్మ తల్లి అనుగ్రహం పొందాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రం దేవరకొండ రోడ్డులో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాలకు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఆలయ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా మొదటి రోజు ఆలయంలో గణపతి ప్రార్థన, భూతల యాగశాల, విఘ్నేశ్వర పుణ్యాహవచనం, పంచ గవ్య ఆరాధనా ప్రాశనం, అఖండ దీపారాధన వంటి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ధనిష్ట దంపతులు, బీఆర్‌ఎస్ నాయకులు కేసాని లింగారెడ్డి, తుల సిరాం, సత్యం, వడ్త్య బాలు, జోహార్‌లాల్, వెంకటేష్, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుర్రంపోడు : మండలంలోని గుర్రంపోడు, పోచంపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ శ్రీకాంత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కనగల్ నుంచి విద్యుత్ సరఫరా జరిగే 33 కేవీ విద్యుత్ లైన్‌కి మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మిర్యాలగూడ టౌన్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. మిర్యాలగూడ టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో బోట్యానాయక్‌తండకు చెందిన బదావత్ సైదులు(25) కొంతకాలంగా మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సైదులు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సైదులు మృతిపై అనుమానాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

నల్లగొండ: పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం నల్లగొండలోని పీఆర్‌టీయూ భవన్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయ, అధ్యాపక వర్గంపై ఉందన్నారు. అనంతరం రిటైర్ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు భిక్షంగౌడ్, సుదర్శన్‌రెడ్డి, బసిరెడ్డి రవీందర్‌రెడ్డి, కాలం నారాయణ్‌రెడ్డి, ఒరు శ్రీనివాసులు, అద్దంకి సునీల్, కరుణాకర్‌రెడ్డి, యూసుఫ్ పాష, కళావతి, సువర్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కంభంపాటి శంకర్

మిర్యాలగూడ: దామరచర్ల మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కంభంపాటి శంకర్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్రనాయక్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం దామరచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ మండల మహాసభలో వారు మాట్లాడారు. దామరచర్ల మండల కేంద్రంలో నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడంతోపాటు బాలుర గురుకుల పాఠశాలకు సొంత భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేయడానికి కంకణం కట్టుకుందన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, వీరన్న, జగన్, సైదానాయక్, న్యూమాన్, అఖిల్, బన్ని, కిరణ్, సంపత్‌కుమార్, మణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పెద్దవూర : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకూ పోరాటం చేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ నాగార్జునసాగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీశ్, కోరే రమేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం మండల మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడుతుందని విమర్శించారు. అధికారంలోకి రాకముందు సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి, నేటికి విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ నెల 19, 20తేదీల్లో నల్లగొండలో నిర్వహించే సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మహాసభలో నాయకులు ఖమ్మంపాటి సాయికుమార్, జటావత్ చరణ్, వర్షిత్, అంజి, శివ, రమేష్, నందిని, శృతి, అఖిల తదితరులు పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషిచేయాలి



గోవర్ధనాచారిని సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు

మిర్యాలగూడ టౌన్ : విశ్వబ్రాహ్మణ సంఘం బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని స్వర్ణకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యినుగుర్తి గోవర్ధనాచారి అన్నారు. ఆదివారం స్థానిక మహాత్మా జ్యోతిరావ్‌పూలే బీసీ భవనంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని సంఘం అధ్యక్షుడు శిరసనగండ్ల ఈశ్వరాచారి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా తెలంగాణ మలిదశ ఉద్యమనేత కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు ఆర్పించారు. అనంతరం స్వర్ణకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యినుగుర్తి గోవర్ధనాచారి, మండల అధ్యక్షుడు శిరసనగండ్ల ఈశ్వరాచారి, సీనియర్ నాయకులు ఏడుకొండలు, కూరేళ్ల మట్టయ్యచారి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల నాటికి అన్నీ గ్రామాల్లో కమిటీలను పూర్తి చేయాలన్నారు. అనంతరం సంఘం ముఖ్య సలహాదారులుగా దొంతోజు రామాచారి, కన్నెకంటి ఉపేంద్రాచారి, శిరసనగండ్ల పిచ్చయ్యచారి, ఉపాధ్యక్షుడిగా కన్నెకంటి శ్రీనివాసాచారి, కోశాధికారిగా కొండోజు జనార్దనాచారిని నియమించి వారికి నియామక పత్రాలు అందజేశారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి తాడోజు శ్రీనివాసాచారి, నాయకులు నర్సింగోజు పెద్దయ్యచారి, దేవులపల్లి రమేష్‌చారి, బంగారు నరేంద్రచారి, రవీంద్రాచారి, తరుణోజు యాదగిరి, భిక్షమాచారి,తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా దినసరి కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం మిర్యాలగూడ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ది మిర్యాలగూడ పార్‌బాయిల్డ్ మోడ్రన్ రైస్, ఆయిల్ అండ్ దాల్ మిల్లుల్లో పనిచేసే వర్కర్స్ (దినసరికూలీలు) యూనియన్ (టీఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకులు మాట్లాడారు. 2025 జనవరి 31వతేదీతో దినసరి కూలీల అగ్రిమెంట్ కాలపరిమితి ముగిసిందని, ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా దినసరి కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రోజువారి కూలీ పగలు రూ.900, నైట్ రూ.950, ఆదివారం పనిచేస్తే అదనంగా రూ.250 ఇవ్వాలని, అదే విధంగా వార్షిక బోనస్‌ను ప్రతిఒక్కరికి రూ.3500తో పాటు టవల్, ప్రతి ఒక్కరికి ఈఎస్‌ఐ, పీఎఫ్ కట్టాలని, ప్రమాద బీమా రూ.8లక్షలకు తగ్గకుండా చూడాలని వినతిలో కోరినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నేతలు ముక్కెర అంజిబాబు, పి.వెంకటేశ్వర్‌రావు, సుమన్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, వెంకట్‌రెడ్డి, పిచ్చయ్య, చెన్నయ్య, మోహన్‌రెడ్డి, అండయ్య, నాగేందర్, సైదులు, కనకయ్య, హుస్సేన్ తదితరులున్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

త్రిపురారం : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆదివారం త్రిపురారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు రెమడాల రమేష్, కిలారి సైదులు, సిద్ధాంతి కృష్ణ, మేకల రామకృష్ణ, పానుగోటి హరీష్, రామకృష్ణ, మేకల మధు, మెరుగు మహేష్, కొప్పు సోమయ్య, వల్లపుదాసు హుస్సేన్, మామిడి మహేష్, వాంకుడోతు హుస్సేన్, ఇస్లావత్ లోకేష్, శంకర్, వెంకట్, నాగరాజు, క్రాంతి, కలకుంట్ల లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం సంక్షేమానికి కృషి చేయాలి

- అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్‌యాదవ్



నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేస్తున్న యాదవ సంఘ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి: యాదవ సంఘ సంక్షేమానికి యాదవులు కృషి చేయాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండల్‌యాదవ్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం ఉమ్మడి మండల యాదవ సంఘ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా గుడిపల్లి, పెద్దఅడిశర్లపల్లి మండలాల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుడిపల్లి మండల అధ్యక్షుడిగా భూరం గురువయ్య యాదవ్ , ప్రధాన కార్యదర్శిగా పోలే వెంకటయ్యయాదవ్, పెద్దఅడిశర్లపల్లి మండల అధ్యక్షుడిగా వీరబోయిన ఎల్లయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రాయినబోయిన శ్రీనివాస్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోర్ల శ్రీనివాస్ యాదవ్‌లతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండల్‌యాదవ్, జంగిటి నర్సింహ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, గోవింద్‌యాదవ్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గుర్రంపోడు : జెడ్పీ హెచ్‌ఎస్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



పెద్దవూర : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు

గుర్రంపోడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి హెచ్‌ఎంలు కేసాని సత్యనారాయణరెడ్డి, మంచికంటి కృష్ణయ్య, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, రఘుపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు గుప్తా, చామకూరి లింగారెడ్డి, కలీం, వద్దిరెడ్డి నర్సింహారెడ్డి, రావుల వెంకటనారాయణ గౌడ్‌లను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి రూ.20 వేల విలువైన పాడియం అందించారు.

నవోదయ ఉన్నత పాఠశాలలో..

మండల కేంద్రంలోని నవోదయ పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి తమ గురువులను సన్మానించారు. కార్యక్రమంలో నవోదయ పాఠశాల కరస్పాండెంట్ వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వద్దిరెడ్డి నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పన్నాల గోపాల్, మల్లికార్జున్, వలిశెట్టి సత్యం, రావుల వెంకటనారాయణ, జ్యోతి, ఉమాదేవి, నేహ, స్వప్న, ఆనంద్ పాల్గొన్నారు.

పెద్దవూర : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1992 –93 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలకు రూ. 20వేల విలువ చేసే సౌండ్ బాక్స్ సిస్టం అందించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమస్థానం పొందిన విద్యార్థులకు పూర్వవిద్యార్థుల తరఫున రూ.10వేలు బహుమానంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు వడ్లపల్లి నర్సిరెడ్డి, వంగాల కృష్ణారెడ్డి, సీతారామశర్మ, సీతాకళ్యాణి, సుజాత, ఎంఈఓ తరి రాము, నాటి పూర్వ విద్యార్థులైన ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర అడిషనల్ అడ్వకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి, జీహెచ్‌ఎం బిమ్లా నాయక్, పాపిరెడ్డి, బిమ్లా నాయక్, నడ్డి ఆంజనేయులు, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్ రెడ్డి, అన్నెపాక శ్రీనివాస్, నరేందర్, శివ, కవిత, పుష్పలత, రజిత, విజయ తదితరులు పాల్గొన్నారు.



గుర్రంపోడు : నవోదయ ఉన్నత పాఠశాలలో..

పెద్దవూర : మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలకు చెందిన 2009–10విద్యాసంవత్సరానికి చెందిన విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కూన్‌రెడ్డి రాంరెడ్డి, గుంటక రామాంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, వినోద్, పూర్వ విద్యార్థులు భాను, కిరణ్, నాగ, రమేష్, రామకృష్ణ, శ్వేత, హేమలత, మోతీలాల్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.



పెద్దవూర : నాగార్జున ఉన్నత పాఠశాలకు చెందిన చెందిన పూర్వ విద్యార్థులు

ఏఎన్‌ఎం పోస్టు భర్తీ అయ్యేనా !



కోతిదాడిలో గాయపడిన విద్యార్థిని (ఫైల్)



కడుపు నొప్పితో దేవరకొండ ఆస్పత్రికి వచ్చిన విద్యార్థిని (ఫైల్)



చందంపేటలోని కస్తూరిబా గాంధీ ఆశ్రమ పాఠశాల

- మూడేళ్లుగా కనీస వైద్య సేవలు కరువు
- ఇబ్బందులు పడుతున్న చందంపేట కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థినులు

చందంపేట : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎం పోస్టు మూడేళ్లుగా ఖాళీగా ఉంది. ఏఎన్‌ఎం పోస్టు కోసం తీవ్ర పోటీ ఉండడంతోపాటు రాజకీయ ఒత్తిళ్లు తోడవ్వడంతో ఏఎన్‌ఎం పోస్టు భర్తీలో జాప్యం జరుగుతూ వస్తోంది. దీంతో సకాలంలో ప్రథమ చికిత్స అందక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పాఠశాలలో ఓ విద్యార్థినిని కోతి కరిచింది. ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎం లేని కారణంగా చందంపేట పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ కూడా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో చేసేది లేక పాఠశాలకు తిరిగి వచ్చింది. గతంలో ఓ విద్యార్థికి కడుపు నొప్పితో రావడంతో వైద్యం కోసం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మొత్తం 213 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్న ఈ పాఠశాలలో ప్రథమ చికిత్స అందించేందుకు ఏఎన్‌ఎం అందుబాటులో లేకపోవడంతో తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చందంపేట కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఏఎన్‌ఎం పోస్టు భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.